
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
ఆదివారం 20 అక్టోబరు 2024



గ్రూప్ 1 అభ్యర్థులపై దాడి దుర్మార్గం

తాండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 1 అభ్యర్థులపై పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని వాయిదా వేసి జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన గ్రూప్ 1 అభ్యర్థులను విడుదల చేయాలన్నారు.

జిల్లాలో భారీ వర్షం

మంచిర్యాల కలెక్టరేట్/ నస్పూర్/ మందమర్రిటౌన్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది. భారీ శబ్దంతో పిడుగులు పడడంతో జనాలు వణికిపోయారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నస్పూర్ సబ్ స్టేషన్ నుంచి వెళ్లే ఆర్ అండ్ ఆర్ కాలనీ ఫీడర్ పరిధిలో హౌసింగ్ బోర్డు కాలనీ, రైతు కాలనీ, ప్లడ్ కాలనీ, తాళ్ళపల్లి, సింగపూర్ పునరావాస కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో భారీ గాలులు వీయడంతో వాకర్లు భయంతో పరుగులు పెట్టారు. చిన్నారులతో వచ్చిన మహిళలు బయటకు పరిగెత్తారు.

డీజీపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్‌ను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి హైదరాబాద్‌లో కలిశారు. జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్షపూరితంగా అధికార పార్టీ నాయకులు అక్రమంగా కేసులు పెట్టి రిమాండ్‌కు తరలిస్తున్నారని డీజీపికి ఫిర్యాదు చేశారు. అదే విధంగా అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు గ్యాంగ్‌లుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో అలజడులు సృష్టించి పలువురు యువకులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన దాడుల ఘటనల వల్ల లా అండ్ ఆర్డర్ దెబ్బతిందని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.



భూముల రిజిస్ట్రేషన్లలో అవినీతి దందా

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిని బట్టి రేటు
- నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల సబ్ డివిజన్లు
- ఒక్కో డాక్యుమెంట్‌పై రూ. 40వేలు వసూలు
- డాక్యుమెంట్ రైటర్లపై వసూళ్ల బాధ్యత
- ప్రభుత్వాదాయానికి భారీ గండి

మంచిర్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్లలో అవినీతి దందా జరుగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాల యాల్లో ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు చొప్పున వసూలు చేస్తు న్నారు. అన్నీ సక్రమంగా ఉన్న వాటిలో సైతం వసూళ్ళు చేపడుతు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు చేయాల్సి వచ్చినప్పుడు సంబంధిత అధికారులకు కాసుల వర్షం కురుస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అక్రమ వెంచర్లలో ఏర్పాటు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కొంత కాలంగా ప్రభుత్వం నిలిపి వేసింది. లే అవుట్ అనుమతులు ఉన్న వెం చర్లలోని ప్లాట్లకే రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశాలున్నాయి. అయితే ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని అధికారులు అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు చేస్తూ అందినకాడికి దండుకుం టున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇంతకాలం రిజిస్ట్రేషన్లకు నోచుకోని అక్రమ ప్లాట్లకు ఇకపై జరగనున్నాయి. ఈ మేరకు పలువురు డాక్యు మెంట్ రైటర్లతో ఇటీవల అవగాహన కుదిరినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంతకాలం నిబంధనల మేరకు డాక్యుమెంట్ టూ డాక్యుమెంట్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిగేవి.

డాక్యుమెంట్ ప్రకారం ఎంత భూమి ఉంటే అంతే భూమిని ఒక పేరు నుంచి మరో పేరుపైకి మారుస్తూ రిజి స్ట్రేషన్లు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ ప్రక్రి యను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయి నట్లు తెలుస్తోంది. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా రెగ్యులర్ అధికారి వస్తుండడంతో ఈ లోగానే పనులు చక్కబెట్టాలనే తొందర రియల్ ఎస్టేట్ వ్యాపారులతోపాటు అధికారు ల్లోనూ ఉంది. వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ విధుల్లో చేరనున్నందున ఆ లోపే పెండింగులో ఉన్న కొత్త డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు రంగం సిద్ధమైంది.

మిగతా 7వ పేజీలో

డాక్యుమెంట్ రైటర్లే సూత్రధారులు

కొత్త డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లకు కొందరు డాక్యుమెంట్ రైటర్లే సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు సన్నిహితంగా ఉండే డాక్యుమెంట్ రైటర్లు అక్రమ రిజిస్ట్రేషన్‌ల బాధ్యత భుజాల పైన వేసుకున్నారు. అధికారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారు లకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ పనులు చక్కబెడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇటీవల రహస్య సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సబ్ డివిజన్ ప్లాట్లకు ప్రత్యేకంగా రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ. 40 వేలు వసూలు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.

గూడెం సందర్శించిన రీజినల్ జాయింట్ కమిషనర్



దంపతులు సన్మానిస్తున్న అర్చకులు

దండేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకిష్టారావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం రీజినల్ కమిషనర్ దంపతులను ఆలయ అర్చకులు సన్మానించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన రఘస్వామి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య శిబిరం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య (లక్ష్మీనగర్ బ్రాంచ్)లో శనివారం ప్రతిమ ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు కంటి వైద్యులు ప్రతిమ పరీక్షలు చేసి కళ్ళను ఎలా రక్షించుకోవాలో పలు సూచనలు చేశారు. పాఠశాల మంచిర్యాల జోన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవింద్, ప్రిన్సిపాల్ ఆయూబ్, కోఆర్డినేటర్ నాగరాజు, డీన్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వనందుకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రైతు భరోసా రైతు రుణమాఫీని చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపడతామని తెలిపారు.

ప్లేట్‌లెట్స్ దానం

గర్మిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని సంజీవని ఆసుపత్రిలో ఓ పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అత్యవసరం ఉండగా విషయం తెలుసుకున్న న్యాయవాది, రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్ష తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కొట్టే నటేశ్వర్ శనివారం ప్లేట్‌లెట్స్ దానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 28 సార్లు ప్లేట్‌లెట్స్, 49 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ప్రతీ ఒక్కరు ఆదుకోవాలని కోరారు.

జాడలేని ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఆందోళనబాట పడుతున్న విద్యార్థులు
- జిల్లాలో రూ.2కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు

6



నర్సరీతో ఉపాధి
పూణెలో శిక్షణ

7



పత్తి రైతుల్లో ఆందోళన
- వర్షాలు లేక పూత, కాత లేని మొక్కలు
- పత్తి సాగుకు అనుకూలించని కాలం

8



ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియను శనివారం నిర్వహించారు. 32 (టీ) ఎన్‌సీసీ బెటాలియన్ ఆదిలాబాద్‌కు చెందిన హవల్దార్ కే.రవీందర్ విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి 56 మందిని ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ జవాన్లకు సహాయ సహకారాలు అందించడంలో ఎన్‌సీసీలో సీ సర్టిఫికెట్లు పొందిన కేడెట్లు ముందున్నారన్నారు. ఎంపికైన అభ్యర్థులను సుబేదార్ కవల్జీత్ సింగ్ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు,విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 7వ విడతలో భాగంగా 'వాక్-ఇన్-అడ్మిషన్స్' ఉంటాయని, 30వ తేదీన ఆన్‌లైన్ ప్రింటవుట్, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జైపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పవర్ ప్లాంట్ గెస్ట్‌హౌజ్‌లో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో కలిసి అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా శుద్ధమైన తాగు నీటిని అందించడంతోపాటు పైపులైన్ల మరమ్మతు చేపట్టాలన్నారు. అంతర్గత రహదారులు, భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వంగిన, విరిగిన స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని, తెగిన, వేలాడే విద్యుత్ తీగలను సరి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రుల్లో పారిశుధ్యం నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు.

రోడ్లు, డ్రైనేజీల పనులకు శంకుస్థాపన

మందమర్రి టౌన్: మందమర్రి మున్సిపాలిటీ అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం రూ.3 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత పాలకులు మున్సిపాలిటీని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, దుర్గం నరేష్, సొత్కు సుదర్శన్, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎంపీ వంశీవివేక్‌ను సన్మానిస్తున్న బండి సదానందం

మందమర్రి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్‌ఎస్ నాయకుల విమర్శలను తిప్పికొడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ వివేక్ తెలిపారు. శనివారం ఊరు మందమర్రిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు నాయకులు స్వాగతం పలి కారు. విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఖజానా ఖాళీ చేశారని విమర్శించారు. అప్పులకే తమ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తుందని పేర్కొన్నారు. త్వరలో మంచిర్యాల, బెల్లంపల్లిలో పలు రైళ్ళు నిలుపుతారని, పాత రైళ్ళు పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. మందమర్రిలో రామగిరి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉంటుందన్నారు. నాయకులు బండి సదానందం, సొత్కు సుదర్శన్, పెద్ది రాజన్న, నోముల ఉపేందర్‌గౌడ్, సజ్జు, పాల్గొన్నారు.

జైపూర్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. నర్సింగాపూర్(ఎస్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ కాసిపేట సతీష్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా శనివారం ఎంపీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

అభివృద్ధిలో వెనుకాడేది లేదు

మందమర్రి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధిలో వెనుకడుగు వేసేదిలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమృత్ పథకం కింద రూ.30 కోట్లతో ఇంటింటా నీరందిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ధాన్య 'లక్ష్మీ'



- యేటా ధాన్యం కొనుగోలులో కీలకంగా మహిళా సంఘాలు
- కమీషన్‌లతో ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు
- ప్రారంభమైన వానాకాలం కొనుగోళ్లు

బెల్లంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు కుటుంబ బాధ్యతలు చూస్తూనే మరో వైపు మహిళలు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. మహిళ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించింది. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ మహిళలు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూ లాభాల బాట పడుతు న్నారు. తమకు సాధ్యం కానిది లేదనే రీతిలో ముందుకు సాగుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండగా రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తూ కమీషన్‌ల రూపంలో ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

యేటా ముందంజలో నిలుస్తూ..

ప్రభుత్వం యేటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాలతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో మొత్తం స్వయం సహాయక సంఘాలు 10,300 ఉండగా గ్రామ సంఘాలు 355 ఉన్నాయి. మండల సమాఖ్యలు 16 ఉండగా జిల్లా సమాఖ్య 1 ఉంది. వీరి ఆధ్వర్యంలో గతేడాది జిల్లాలో ఐకేపీ తరుపున మహిళా సంఘాల ఆధ్వర్యంలో 135 కేంద్రాలను నడిపారు. వీరు 12,770 మంది రైతుల నుంచి 8,41,350 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో రవాణా చేశారు. అన్నదాతల డబ్బులు ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.32 చొప్పున కమీషన్ సంఘాలకు అందించింది. దీంతో జిల్లాలో సేకరించిన ధాన్యానికి మహిళ సంఘాలకు రూ. 2.65 కోట్లు కమీషన్ అందుకున్నారు.

18 సంవత్సరాల నుంచి కేంద్రాల నిర్వహణ

ప్రభుత్వం మహిళ సంఘాలను ఆర్థికంగా

మిగతా 7వ పేజీలో

కవ్వాల మరింత అభివృద్ధి



కెమెరా ద్వారా వీక్షిస్తున్న డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు

జన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల అటవీ ప్రాంతం టూరిజం పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి మాధవరావు అన్నారు. శనివారం కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్‌లలో సఫారీ ద్వారా పర్యటించారు. కెమెరా ద్వారా అటవీ ప్రాంతాన్ని వీక్షించారు. మైసమ్మకుంట, పక్షులను, జంతువులను లెన్స్ ద్వారా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానికుల సహకారంతో కవ్వాల టూరిజం పరంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. వన్య ప్రాణులను కాపాడుకోవాలని, వన్య ప్రాణులను, అడవిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

నెన్నెల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గొళ్లపల్లిలో మెయిన్ రోడ్డుకు మరమ్మతు చేయాలని శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డికి ప్రజలు వినతిపత్రం అందజేశారు. రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. బీటీ మొత్తం లేచిపోయి మట్టి రోడ్డును తలపిస్తుందన్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందూరి రమేష్, మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతిగౌడ్, మాజీ ఉప సర్పంచ్ జాడి నారాయణ, ముదాం రమేష్, వేల్పుల మొగిలి, ఇందూరి సురేష్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

డీఈఓ ఎస్.యాదయ్య

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ఎస్. యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు 1 నుండి 10వ తరగతులకు నిర్వహించాలన్నారు. 1 నుంచి 5 తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను మండలాల కస్టోడియన్ (ఎంఈఓ), జాయింట్ కస్టోడియన్ సహాయంతో అన్ని పాఠశాలలకు పంపించామన్నారు. 6 నుంచి 10 తరగతుల ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీ, కస్టోడియన్ హై స్కూల్స్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను అదే రోజు ఉదయం 8 గంటలకు తీసుకువెళ్లి పరీక్ష లు నిర్వహించాలని సూచించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించి నవంబర్ 2న మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించాలని తెలిపారు. సమాచారం కోసం డీసీఈబీ సహాయ కార్యదర్శి డి.కుమారస్వామి 9490092767 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడితో తల్లిదండ్రుల గొడవ

- విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు
- విద్యార్థి చెవిలోంచి రక్తం

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లవాన్ని ఎందుకు కొట్టారని ఓవిద్యార్థి తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు వచ్చి గొడవ చేశారు. వివరాల్లోకివెళితే.. మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని గణిత ఉపాధ్యాయుడు సంతోష్ లెక్కలు సరిగ్గా చేయడం లేదని శుక్రవారం తలపై కొట్టాడు. దీంతో విద్యార్థి ఇంటికివెళ్లి తల నొప్పుందని పడుకున్నాడు. నన్ను టీచర్ తలపై గట్టిగా కొట్టినట్లు తల్లి దండ్రులకు తెలిపాడు.విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడితో గొడవకు దిగారు. తలపై కొట్టడంతో పిల్లవాడి చెవులనుంచి రక్తం వస్తోందన్నారు. మంచం నుంచి లేవడం లేదని ఆగ్రహించారు. హెచ్ఎం తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లవాన్ని ఆసుపత్రికి తీసుకెళ్లండి ఖర్చులన్నీ సంబంధిత టీచరే భరిస్తారని తెలపడంతో శాంతించారు. పిల్లవాడిని చికిత్స కోసం మంచిర్యాల ఆసుప త్రికి తీసుకెళ్లారు. ఇటీవల ఈ టీచర్ మాకు వద్దని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు ధర్నాచేశారు. దీంతో ఉపాధ్యాయుడు సంతోష్‌ను 9వతరగతికి బోధించాలని హెచ్ఎం తెలపడంతో విద్యార్థులు తరగతులకు వెళ్లారు. ఎన్ని సంఘటనలు జరిగినా సంబంధిత హెచ్ఎం ఉన్నతాధికారుల దృష్టికి రిపోర్టు చేయకపోవడంతో ఇలాంటిఘటనలు పునరావృతం అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

జాడలేని ఫీజు రీయింబర్స్‌మెంట్

- ఆందోళనబాట పడుతున్న విద్యార్థులు
- నిధులు విడుదల చేస్తేనే కళాశాలల మనుగడ
- జిల్లాలో రూ.2కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు



ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థుల ర్యాలీ

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంటు పథకం లక్ష్యం పక్కదారి పడుతోంది. ప్రతిఏటా పేద విద్యాలర్థుకు ట్యూషన్ ఫీజులు, మెస్‌చార్జీలు చెల్లించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం చెల్లించలేదు. ప్రతి నెలా ఆయాశాఖల అధికారులు నివేదికలు పంపిస్తున్నా రీయింబర్స్‌మెంటు విడుదల కాకపోవటంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయి. బడ్జెట్ రేపోమాపో వస్తుందని ఎదురుచూడటమే తప్పా విద్యార్థులకు ఫీజు రీయింబర్సమెంటు విడుదల చేయడం లేదు. దీంతో విద్యార్థులు పోరుబాట పడుతున్నారు. మూడురోజుల క్రితం పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు. దశల వారీ పోరాటం చేసేందుకు విద్యార్థులంతా సన్నద్ధమవతున్నారు.

2021-22 నుంచి విడుదల కాని నిధులు..

జిల్లాలో ఆరు డిగ్రీ కళాశాలలుండగా, ఈ కళాశాల్లో చదువుతున్న 1200మంది విద్యార్థులకు మూడు విద్యా సంవత్సరాలకి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంటు దాదాపు రూ.2 కోట్ల మేర పెండింగ్‌లో ఉంది. దీంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సంబంధించిన టీసీ, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవటంతో కళాశాలలు నడపటం కష్టంగా మారిందని ప్రయివేటు కళాశాలల యజమానులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిధులు వెంటనే విడుదల చేయాలి..

అతీక్ హుస్సేన్, బీకాం, కాగజ్‌నగర్



రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి. మూడేళ్లుగా విడు దల చేయలేదు. కళాశాల యాజమాన్యం కాలేజీ ఫీజు కట్టాలని మాపై ఒత్తిడి తెస్తోంది. అధికారులు, నాయకులు వెంటనే స్పందించి నిధులు విడుదల చేసేలా చూడాలి.

నిర్లక్ష్యం చేయవద్దు..

శివకృష్ణ, బీఎస్సీ, కాగజ్‌నగర్



ఫీజు రీయింబర్స్‌మెంటు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకచొరవ తీసుకోవాలి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ విషయంపై త్వరగా స్పందిస్తే బాగుటుంది. విద్యార్థుల భవిష్యతుతో చెలగాటం ఆడవద్దు. అధికారులు వెంటనే స్పందించాలి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

హనుక్, ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్



మూడేళ్ల నుంచి ఫీజురీయింబర్స్‌మెంటు నిధుల కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదు. కళాశాల నడిపేందుకు చాలా కష్టంగా ఉంది. కాలేజీలో లెక్చరర్లు, ఇతరత్రా ఖర్చులకు చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

తండ్రుల బాటలో తనయులు

- సిర్పూర్(టి)లో ఉపాధ్యాయ కుటుంబం


మొహమ్మద్ హుజైఫా


మొహమ్మద్ హంజ

సిర్పూర్(టి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ కుటుంబం ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతోంది. తండ్రుల బాటలోనే తనయులు నడుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లోనవెల్లి గ్రామానికి చెందిన మన్సూరు అహ్మద్ తాను చదివిన స్కూల్‌లోనే 1980లో టీచర్‌గా నియమితులయ్యారు. చిన్నతనంలోనే ఉపాధ్యాయ వృత్తిలో చేరి కుటుంబభారం, విధినిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. అతని ముగ్గురుతమ్ముళ్లు దానిష్ అహ్మద్, అనీస్‌అహ్మద్, రయాస్‌అహ్మద్‌లు 1997, 2009లో ప్రభుత్వ ఉపాధ్యా యులుగా నియమితులు కావడానికి కృషిచేశాడు. ప్రస్తుతం దానిష్ అహ్మద్ చింతలమానేపల్లిలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా కొనసాగుతుండగా, అనీల్‌అహ్మద్ కాగజ్‌నగర్ పెట్రోల్ ఎంపు ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే రయాస్‌అహ్మద్ కౌటలలోని ప్రభుత్వపాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నాడు.

ఇప్పుడు వారి కుమారులు..

కాగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ-2024 ఫలితాల్లో దానిష్ అహ్మద్ కుమారుడు మొహమ్మద్ హుజైఫా, మొహమ్మద్ హంజ డీఎస్సీ-2024 లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివార్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో డబుల్ బెడ్‌రూపం నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదప్రజలకు డబుల్ బెడ్‌రూం పథకం ద్వారా నివాసం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇంజనీర్ రమాదేవి, ఇరిగేషన్ డీఈ, ఈఈ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


కృత్రిమ మేధస్సు పాత్ర అత్యంత కీలకం



బహుమతులు అందజేస్తున్న ఉదయ్ బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పురోగతిలో కృత్రిమమేధస్సు పాత్ర అత్యంత కీలకంగా ఉందని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. శనివారం సర్‌సిల్క్‌లోని ప్రాథమిక పాఠశాలలో కృతిమ మేధస్సుపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధస్సుతో వివిధ అంశాలకు సంబంధించిన పనులు త్వరగా జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుకు మానవతా విలువలను, నైతిక విలువను జోడిస్తే ప్రపంచ అభివృద్ధి చాలా వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థికగణాంకాల అధికారి జాడిదేవాజీ, విద్యాశాఖ అధికారి వాసుల ప్రభాకర్, న్యాయనిర్ణేతలు సత్యనారాయణ, భిక్షపతి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి


దుర్గం బాపు(ఫైల్)

రెబ్బెన, అక్టోబరు 19: రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన దుర్గం బాపు సీహెచ్‌పీలో (జనరల్ మజ్దూర్‌గా) విధులు నిర్వహిస్తున్నాడు. సొంత పని నిమిత్తం శనివారం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడు వైపునకు వెళతున్న క్రమంలో ఇంద్రానగర్‌వద్ద తన ద్విచక్ర వాహనం ప్రమాదశాత్తు అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో దుర్గం బాపు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సుహాసిని

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బూత్‌కు 200వరకు సభ్యత్వాలను నమోదు చేయించాలని జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సుహాసిని అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎస్సీకాలనీలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో బీజేపీ అతిపెద్ద సభ్యత్వ నమోదు చేసిన రాజకీయ పార్టీగా పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ప్రాథమిక సభ్యత్వ నమోదులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులువిశాల్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

24న భీం వర్ధంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కెరమెరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 24నభీం వర్ధంతిని నిర్వహిస్తామని ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీనాయకులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు రఘునాథ్, జగన్నాథ్ రావు, రాజేశ్వర్, మారుతి, కోవ విజయ్‌కుమార్, ప్రభాకర్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో యథేచ్ఛగా మెడికల్ దందా



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రి టౌన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని హెచ్ఎంఎస్ సెంట్రల్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మందమర్రిలోని ఏరియా ఆసుపత్రిలో సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పాలనలో ప్రారంభమైన ఈ దందా తారాస్థాయికి చేరిందన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే ఎక్కువ ఓసీలు వచ్చాయని మండిపడ్డారు. కారుణ్య నియామ కంతో మెడికల్ దందా పెద్దఎత్తున సాగిందని తెలిపారు. పది సంవత్సరాలకాలంలో నాయకులు మెడికల్ దందాలో కోట్లు దంటుకున్నారన్నారు. త్వరలో ఈ విషయంపై సీఎండీని కలుస్తామన్నారు. సింగ రేణి వ్యాప్తంగా జరుగుతున్న అవినీతి కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెల్ది సుదర్శన్, చొప్పరి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎండీ బలరాంకు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ వినతిపతరం సమర్పించారు. ఈ సంద ర్భంగా సీఎండీకి పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా గతంలో మారు పేరుతో ఉన్న కార్మికులను పేరు మార్పు వెంటనే చేపట్టాలని అన్నారు. అంతే కాకుండా సింగరేణిలో మెరుగైన వైద్యసదుపాయం అందేలా చూడాలని కోరారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

మందమర్రిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేకే5గనిలో పనిచేస్తూ మృతిచెందిన లింగంపల్లి బాలయ్య కుటుంబానికి శనివారం గనిమేనేజర్ ప్రవీణ్ రూ.62వేల ఎస్ఎఫ్ఎస్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, నాయకులు కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంగా కళా స్ఫూర్తిని చాటాలి

- జీఎం శ్రీనివాస్

రెబ్బెన, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగ కళాకారులు ప్రాంత విబేధం లేకుండా ఒకే కుటుంబంగా కళా స్ఫూర్తిని చాటాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం 91వ వార్షిక క్రీడాపోటీల్లో గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన నియర్ బై కల్చరల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగకళాకారులు కోల్ ఇండియా స్థాయిలో రాణించాలన్నారు. సింగరేణికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమ్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఆడిట్ పిట్ కమిటీ

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ శ్రీరాంపూర్ డివిజన్ ఇంటర్నల్ ఆడిట్ పిట్‌కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆడిట్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా హాజరయ్యారు. పిట్‌కార్యదర్శిగా గద్దల రాజు, సహాయకార్యదర్శిగా దాసరి రాజశేఖర్, సంయుక్తకార్యదర్శిగా సామల నరేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొట్ల మల్లేష్, పోతూరి మౌనిక, కార్యవర్గ సభ్యులుగా హరి, రమేష్, ప్రియాంక, శ్రీనివాసు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జీఎం కమిటీచర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమంగా మొరం తవ్వకాలు

భీమారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవాగు ప్రాజెక్టు సమీపంలోని ఇరిగేషన్ శాఖ భూమిలో గుట్టు చప్పుడు కాకుండా మొరం తవ్వకాలు చేపట్టగా శనివారం అధికారులు అడ్డుకున్నారు. ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్లతో మట్టి తీస్తూ లెవెలింగ్ కోసం కొంత దూరంలో ఉన్న సొంత భూమిలో ఓ రైతు మట్టిని పోశాడని తెలిపారు. మట్టి తరలించడం వల్ల ప్రాజెక్టు కట్టకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని మొరం తవ్వకాలు ఆపాలని కోరినా పట్టించుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు మూడు ట్రాక్టర్లను, ఎక్స్‌కావేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రాములు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ తువ్వ కొమురెల్లి, సమ్మయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

నలుగురు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు దొంగిలించి విక్రయించడానికి తీసుకెళ్తుండగా శ్రీరాంపూర్ పోలీసులు పట్టుకున్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన అజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, దేవ సహాయం సెల్వ, చిట్యాల పృథ్వి నలుగురు యువకులు బైక్‌లపై గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు వస్తున్నారు. జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వాహన పత్రాలు చూపలేదు. అదుపులోకి తీసుకొని విచారణ చేయగా డబ్బుల కోసం శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలలో నాలుగు బైక్‌లను దొంగిలించామని తెలిపారు. వాటిని మంచిర్యాలలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. బైక్‌లను స్వాధీనపర్చుకొని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వివరించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్నలను ఏసీపీ అభినందించారు. పోలీసు సిబ్బంది జి. శ్రీనివాస్, సీహెచ్. సత్యంలకు నగదు రివార్డులు అందించారు.

గాయపడిన వారిని పరామర్శించిన నాయకులు


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం రాపల్లిలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, గ్రామానికి చెందిన యువకుల మధ్య జరిగిన పరస్పర దాడిలో గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్, రాజశేఖర్‌లను శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు నియోజకవర్గంలో ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. పార్టీ హాజీపూర్ మండల అధ్యక్షుడు తోట తిరుపతి మాట్లాడుతూ మందపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులపై ఎదురుదాడి చేస్తూ తనపై దాడి చేశారని హైడ్రామా సృష్టించడం విడ్డూరంగా ఉందన్నారు.

యువకుడి అదృశ్యం


కిరణ్ సింగ్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన ఠాకూర్ కిరణ్ సింగ్ (27) అనే యువకుడు అదృశ్య మైనట్లు పట్టణ సీఐ ఎస్.ప్రమోద్‌రావు శనివారం తెలిపారు. కిరణ్ పట్టణం లోని ఓ జ్యువెల్లరీ షాపులో పనిచేస్తున్నాడని, ఈనెల 17న సాయంత్రం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో పని నిమిత్తం చెన్నై వెళ్లాడని, ఇంతవరకు తిరిగి రాలేదన్నారు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని సీఐ తెలిపారు. తండ్రి బాలాజీసింగ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కలమడుగు గోదావరి నది ఒడ్డున తాగుడుకు బానిసై పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం మున్యాల గ్రామానికి చెందిన ఏమునూరి రాజేశం (27) వడ్రంగి పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ముత్యాపూర్ గ్రామానికి చెందిన సుతారి సత్తవ్వ ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కలమడుగు గోదావరి వద్ద ఓ యువకుడు పురుగుల మందు తాగి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడిని గుర్తించామని, మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అడిషనల్ ఎస్ఐ తానాజీ తెలిపారు.

లాటరీ నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఆదిలాబాద్ క్రాస్‌రోడ్డు వద్ద అనుమతి లేకుండా లాటరీ టికెట్లు అమ్ముతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సతీష్ తెలిపారు. పోలీసు సిబ్బంది శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పట్టణంలోని ఆదిలాబాద్ క్రాస్‌రోడ్డు వద్ద లాటరీ టికెట్ అమ్ము తుండగా రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ మం డలం జెండాగూడకు చెందిన జాదవ్ బాబురావు, జాదవ్ నాందేవ్, జాదవ్ శ్రీనివాస్, జాదవ్ కోటేశ్వర్ లాట్ లాటరీ టికెట్లు ముద్రించి ప్రతిటికెట్‌ను వంద రూపాయల చొప్పున అమ్ముతున్నారని అన్నారు. లాటరీలో యాక్టీవా స్కూటీ, 32ఇంచుల స్మార్ట్‌టీవీ బహుమతి ఉందని ఫ్లెక్సీ ద్వారా ప్రచారం చేస్తూ టికెట్లు అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సింగరేణి వైద్యుల నిర్లక్ష్యంతో హెడ్ ఓవర్‌మెన్ మృతి

గోదావరిఖని, అక్టోబరు 19: సింగరేణి వైద్యుల నిర్లక్ష్యంతో శ్రీరాంపూర్ ఓసీపీలో హెడ్ ఓవర్‌మెన్‌గా పని చేస్తున్న సురేష్(40) శనివారం రాత్రి మృతిచెందాడు. గోదావరిఖని పరుశరాంనగర్‌కు చెందిన సురేష్ మధ్యాహ్నం ఛాతిలో నొప్పి రావడంతో సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేరాడు. వైద్యులు కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించగా బంధువులు హైదరాబాద్‌కు రెఫర్ చేయాలని కోరారు. వైద్యులు స్పందించకపోవడంతో సాయంత్రం సురేష్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. రామగుండం మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లగానే సురేష్ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరిగి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రికి వచ్చేలోపే సురేష్ మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లనే సురేష్ మృతి చెందాడని, రెఫరల్ విషయంలో వైద్యులు సరిగా స్పందించకపోవడంతో సురేష్ మృతి చెందాడని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి ఆరోపించారు.

హత్యాయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తనపై హత్యాయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన సింగతి నరేందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సింగతి మల్లేష్, ఉమాకర్, అంజక్కలు గొడ్డలితో దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేయగా నాయకుల అండదండలతో కేసును తప్పుదోవ పట్టించారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి దాడి చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భూముల రిజిస్ట్రేషన్లలో
అవినీతి దందా

(5వ పేజీ తరువాయి)

వేలల్లో కొత్త డాక్యుమెంట్లు పెండింగ్....

ఐదారు నెలలుగా భూముల సబ్ డివిజన్ రిజిస్ట్రేషన్లు జిల్లాలో నిలిచిపోయాయి. దీంతో అక్రమ వెంచర్లలో ఏర్పాటు చేసిన ప్లాట్లకు సబ్ డివిజన్ రిజిస్ట్రేషన్లు చేయించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో వేల సంఖ్యలో కొత్త డాక్యుమెంట్లు పెండింగులో ఉన్నాయి. కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఒక్కో డాక్యుమెంట్ రైటర్ వద్ద కనీసం వంద కొత్త డాక్యుమెంట్ల వరకు పెండింగులో ఉన్నట్లు సమాచారం. వాటన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయిస్తున్నారు. వారి ద్వారా తమ పనులు చక్కబెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకున్నారు. రెండు మూడు రోజుల్లో పెండింగులో ఉన్న కొత్త డాక్యుమెంట్లన్నింటికీ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమంగా భూముల సబ్ డివిజన్‌కు తెరలేవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడనుంది. వ్యవసాయ భూములను గుంటల్లో నుంచి గజాలకు నాలా కన్వర్షన్ చేయించిన తరువాత విక్రయించేందుకు కొత్త డాక్యుమెంట్ తయారు చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొత్త డాక్యుమెంట్ తయారీ మొదలుకొని రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు 200 గజాల స్థలానికి భూమి విలువను బట్టి రూ.40 వేల నుంచి రూ.80 వేలకు రేట్లు ఫిక్స్ చేశారు. ఇందులో డాక్యుమెంట్ రైటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు వాటాలు ఉంటాయనే ఆరోపణలున్నాయి. పాత డాక్యుమెంట్ల కంటే కొత్త వాటికి 40 శాతం అదనంగా వసూలు చేస్తారని సమాచారం. వ్యవసాయ భూములను దొడ్డిదారిన కన్వర్షన్ చేయిస్తే ప్రభుత్వ ఆదానికి గండి పడుతుండగా, అధికారులకు మాత్రం కాసుల పంట పండుతోందనే చర్చ జరుగుతోంది.

నర్సరీతో ఉపాధి


నర్సరీలో ఉన్న పూల మొక్కలు

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం వేచి చూడకుండా సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో నర్సరీని స్వయం ఉపాధిని ఎంచుకున్నారు. వివిధ రకాల మొక్కలు పెంచుతూ, మరికొన్ని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. బెల్లంపల్లి మండలం కాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తొంగల వెంకటేష్, సోమగూడెం గ్రామానికి చెందిన బూపెల్లి శ్రీనివాస్‌లు స్నేహితులు. వీరిద్దరు పీజీ పూర్తి చేశారు. అనంతరం కొంతకాలం ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు చేశారు. వీరికి వ్యవసాయం మీద ఆసక్తి ఉండడంతో ఉద్యోగాలు వదిలేసి పూణెలో మొక్కలు, నర్సరీల పెంపకంపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన స్థలాన్ని లీజుకు తీసుకుని రూ.30 వేల పెట్టుబడితో నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ. 15 లక్షల పెట్టుబడి వరకు

పూణెలో శిక్షణ

వెళ్లింది. 13 సంవత్సరాలుగా నర్సరీలో వివిధ రకాల పండ్ల, పూల మొక్కలను విక్రయిస్తున్నారు. ఈ మొక్కలను పూణె, బెంగుళూరు, కేరళ, రాజమండ్రి, కోల్‌కత్తా నుంచి తీసుకువస్తున్నారు. మొక్కలను విక్రయిస్తూ లాభాలు పొందడంతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు.

మొక్కలపై ఆసక్తితో నర్సరీని ఏర్పాటు చేశాం
వెంకటేష్, బెల్లంపల్లి



పీజీ అనంతరం ఉద్యోగ ప్రయత్నం చేశాను. ఉద్యోగం రాక పోవడంతో మొక్కలపై ఉన్న ఆసక్తితో స్నేహితుడితో కలిసి నర్సరీని ఏర్పాటు చేశా. తాము ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది.

స్నేహితులుగా ముందుకు వెళ్తున్నాం
శ్రీనివాస్ , బెల్లంపల్లి



చిన్నప్పటి నుంచి స్నేహితులుగా ఉన్నాం. మా ఇద్దరిలో ఇప్పటి వరకు ఎలాంటి మనస్పర్థలు రాలేదు. ఒకరి నిర్ణయాలను ఒకరు గౌరవించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. నర్సరీ ప్రారంభంలో కష్టనష్టాలను ఎదుర్కొన్నాం. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్ళి లాభాలు ఆర్జించాం.

ధాన్య 'లక్ష్మి'



(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేసేందుకు 2006లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి కేటాయించారు. గ్రామైఖ్య సంఘాల నుంచి కమిటీలను ఎన్నుకుని వారి ద్వారా ధాన్యం కొనుగోలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన గ్రామాల్లో మహిళ సంఘాల నుంచి ఐదుగురిని నిర్వాహకులుగా ఎంపిక చేస్తారు.వీరికి జిల్లా కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ ఇస్తారు. రైసుమిల్లర్లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నారు.

ఈ యేడు ఖరీఫ్‌లో జిల్లాలో 148 కేంద్రాలు

ధాన్యం కొనుగోలుపై మహిళా సంఘాల్లో ఆసక్తి పెరుగుతుండడంతో అధికారులు సైతం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈయేడు జిల్లాలో 148 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందు కు సంబంధించి జిల్లాలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభ మయ్యాయి. వానాకాలం సీజన్‌కు సంబంధిం చి ధాన్యం కొనుగోలుకు మహిళ సంఘాలు, అధికారులు సన్నద్ధమయ్యారు.

ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు
స్వప్న, బుచయ్యపల్లి, సంఘం అధ్యక్షురాలు



రైతులకు వారధిగా ఉంటూ ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. యేటా కేంద్రానికి ధాన్యం వచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లుకు తరలించే వరకు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. కొనుగోలు ద్వారా వచ్చే కమీషన్‌తో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. రైతులకు మంచి సేవలు అందించడంతోపాటు ఆర్థిక తోడ్పాడుకు ఉపయోగపడుతుంది.

సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం
అనూష, మహిళ సంఘం కార్యదర్శి



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి పూర్తయ్యే వరకు సమర్థ వంతంగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులు సొంత గ్రామంలోనే ధాన్యం అమ్ముకునే వెసలుబాటు ఏర్పడుతుంది. ఈ విధానంతో రైతులకు లాభం కలుగుతుంది. దీంతో పాటు వచ్చే కమీషన్‌తో సంఘాన్ని బలోపేతం చేసుకుంటూ రాబోయే రోజుల్లో మరింత ఆర్థికంగా లాభపడతాం.

మహిళలకు ప్రయోజనం
కిషన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి



ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో మహిళలు సమర్థవంతంగా పని చేస్తుండడంతో వారికి ప్రయోజ నం చేకూరుతుండడంతో పాటు మంచి పేరు వస్తుంది. యేటా అత్యధికంగా ధాన్యాన్ని సేకరించి లక్షలాది రూపాయల ఆదాయాన్ని మహిళలు పొందుతున్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో రైతులు స్థానిక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు.

అండర్ 14 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


లక్ష్మణ్‌సాయి

గర్మిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాకు చెందిన వేములపల్లి లక్ష్మణ్‌సాయి అండర్ 14 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 17 వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన ఆదిలాబాద్ జోన్ జట్టు నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. నవంబర్‌లో బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. లక్ష్మణ్ సాయి మంచిర్యాల కాలేజీ రోడ్డులోని గురు క్రికెట్ అకాడమీ కోచ్ దుర్గా ప్రసాద్ వద్ద శిక్షణ పొందాడు. లక్ష్మణ్ సాయిని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీఈవో యాదయ్య, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రెటరీ ఫణిరాజా, కోచ్ దుర్గా ప్రసాద్‌లు అభినందించారు.

బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు


ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అండర్ 17 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను అచ్చలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహించారు. దాదాపు 70 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ జోనల్ నాలుగు జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంఈవో మల్లేష్‌లు హాజరై పోటీలను ప్రారంభించారు. కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అబ్జర్వర్ రామ్మోహన్, పీడీలు యాకూబ్, వహీదా, పీఈటీలు రవీంద్ర, రాజేష్,కవిత,శేఖర్, ప్రధానోపాధ్యాయురాలు ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి కరాటే ఎంపిక పోటీలు


కరాటే ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ వేణు

నస్పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జోనల్ స్థాయి అండర్ 14-17 బాలబాలికల కరాటే ఎంపిక పోటీలు శనివారం నస్పూర్ కాలనీలో జరిగాయి. ఈ ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ప్రారంభించారు. పోటీలకు మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు.

ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అండర్ -14 కు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 2 తేదీ నుంచి 4వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. మిగిలిన విభాగాల క్రీడాకారులకు తేదీలు ఖరారు కావాల్సి ఉందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీఈవో యాదయ్య అభినందనలు తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలు భూషణ్ (నిర్మల్), దేవయ్య (ఆసిఫాబాద్), ప్రవీణ్ కుమార్ (ఆదిలాబాద్)లు వ్యవహరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి, కార్యదర్శి శివమహేష్, విశాల్ చైతన్య, శ్రీనివాస్, నరేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణి రాజా, ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ గోపతి సత్యం, పిడి రాజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ మహేష్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి సెమినార్


విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విజ్ఞాన అంశాలపై ఆసక్తి పెంచేందుకు, నూతన టెక్నాలజీపై పట్టు సాధించేందుకు శనివారం బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్‌ను నిర్వహించారు. సెమినార్‌లో పలు యాజమాన్య పాఠశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్ అండ్ కన్సర్న్స్ అనే అంశంపై చార్టులు, పీపీటీల ద్వారా ప్రదర్శన ఇచ్చారు. ప్రథమ స్థానంలో ఆంటోని (7వ తరగతి, కార్మల్ కాన్వెంట్ హైస్కూల్), ద్వితీయ అదీబ షహేర్ (స్లేట్ హైస్కూల్, జన్నారం), తృతీయలో ఏ.భవిష్య (9వ తరగతి, జిల్లా పరిషత్ పాఠశాల, మంచిర్యాల) విజేతలుగా నిలువగా వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఆంటోని త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొంటారని మధుబాబు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ముదిగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్, సుధా, మూర్తి, చక్రపాణి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

జన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం మురిమడుగు గ్రామంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బీజేపీ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మండల కార్యదర్శి కనికరం అశోక్, నాయకులు లింగన్న, ప్రమీల, బుచ్చన్న, రాజు, రాజన్న, లక్ష్మణ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ సిబ్బందికి వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వైద్య శాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందికి శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి కాలరీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన శిబిరానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి హాజరయ్యారు. ఉద్యోగులకు ఈసీజీ, వివిధ రకాల పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని పరిసర ప్రాంత ప్రజల కోసం త్వరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, ఆర్‌కే 6 గని మేనేజర్ తిరుపతి, డాక్టర్ మనీషా, మంచి ర్యాల డివిజనల్ అటవీ అధికారి సర్వేశ్వర్, రేంజ్ అధికారులు రత్నాకర్‌రావు, అప్పలకొండ, పూర్ణచందర్, దయాకర్, సదానం దం, మంచిర్యాల డీఆర్‌ఓ అబ్దుల్ హజార్, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం

కాసిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి అన్నారు. శనివారం ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఓటరు నమోదు పత్రాలు అందించారు. మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి, రమణారెడ్డి, కృష్ణ గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తాండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లికి చెందిన చల్లూరి ఆనంద్ చొరవతో హెల్పింగ్ సొసైటి ఫౌండేషన్ సభ్యులు శనివారం కిష్టంపేట, రేచినిరోడ్డు, తంగళ్లపల్లి, అశోక్‌నగర్‌లలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సొసైటి సభ్యులు సుశీల్‌కుమార్, అఫ్జల్‌పాషా, నాయకులు గోమాస తిరుపతి, శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

ఘనంగా ఓంకార్ వర్ధంతి

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ శాసనసభ్యుడు, ఎంసీపీఐయూ నాయకుడు మద్దికాయల ఓంకార్ వర్ధంతిని పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఎంసీపీఐయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, ఆరేపల్లి రమేష్, సతీష్, రాహుల్, అరుణ్, రాజు, శ్రీను, మంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యానికి ఎంఈవో బయోమెట్రిక్ వేయాలి


ఎంఆర్సీ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

దండేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యానికి ఎంఈవో బయోమెట్రి క్ వేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజే శ్వర్‌రావు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లచ్చయ్యలు కోరారు. శనివారం దండేపల్లి విద్యా వనరుల కేంద్రంలో వినతిపత్రాన్ని కార్యాలయ ఎంఆర్‌సి సిబ్బందికి సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెల ఎంఎల్ఎస్ పాయింట్ వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలి


మిట్టపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో బాపురావు

జైపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముదిగుంట, కాన్కూర్, మిట్టపల్లి గ్రామపంచాయతీల నర్సరీలను సందర్శించారు. నర్సరీల్లో బ్యాగుల ఫిల్లింగ్ త్వరగా చేయించాలని కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి సూచించారు. మొక్కలకు రోజు నీరు పోయాలని సూచించారు.

మహిళలకు చీరలు పంపిణీ



లక్సెట్టిపేట మండలంలో చీరలను పంపిణీ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

భీమారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళలకు శనివారం ఐకేపీ ఏపీఎం త్రయంబకేశ్వర్, ఎంపీవో సతీష్‌రెడ్డిలు చీరలను పంపిణీ చేశారు. సీసీలు శంకర్, సత్యవతి, రాజ్యలక్ష్మి, మండల సమాఖ్య నాయకురాల్లు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటరూరల్: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీతో పాటు తలమల గ్రామంలో ఐకేపీ ద్వారా చీరలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఐకేపీ సీసీ సుమలత, సీఏ మల్లేష్, మొగిలి, కాంగ్రెస్ నాయకులు రాము, బారతి, చిన్నయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పట్టణ భరోసా బాట కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నవంబర్ 8 వరకు నిర్వ హించే బెల్లంపల్లి పట్టణ భరోసాబాట కరపత్రాలను శనివారం తిలక్ స్టేడియంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వార్డు ల్లోని దళిత, గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి, నిరుద్యోగ యువతకు సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి అవకా శాలు, ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యక్రమం చేపట్టామన్నారు. సేకరించిన సమస్యలను నివేదిక ద్వారా ఎమ్మెల్యేకు, అధికారులకు తెలియజేస్తామన్నారు. నాయకులు మల్లారపు చిన్నరాజం, కుంబాల రాజేష్, రత్నం ఐలయ్య, శ్రీధర్, రాజలింగు, శంకర్‌బాబు, చంద్రశేఖర్, శేఖర్, రాంనాద్, శంకర్ పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి

తిర్యాణి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 24న నిర్వహించే పీడీఎస్‌యూ 50ఏళ్ల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి కోరారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లెనిన్, సుకన్య, భవాని, శ్రావణ్, సునీత, రజిత, అభిరామ్, అనురాగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని ఎస్పీవోస్ కాలనీలో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ 2020పథకంలో అనుమతిలేని లేవుట్ల క్రమబద్ధీకరణ కొరకు అందిన దరఖాస్తులు రికార్డులు సరిచూసి సదరుప్లాట్లు భౌగోలిక స్థితిని పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. చెరువు శిఖం, వాగులు సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది



సమావేశానికి హాజరైన విద్యార్థులు

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిల కోసం విద్యార్థులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఎండీ చాంద్‌పాషా అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పీడీఎస్‌యూ 50వ సంతాల స్వర్ణోత్సవసభలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం విద్యార్థులంతా కలిసి పోరాడాలన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి పీడీఎస్‌యూ విప్లవప్రస్తానం గురించి వివరించారు. విద్యార్థి పోరాటాలు కేవలం పీడీఎస్‌తోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ నాయకులు రవి, లక్ష్మణ్, బండారి తిరుపతి, రత్నం పోషన్న, జిల్లా ఉపాధ్యక్షుడు లెనిన్, పట్టణనాయకులు రాంకుమార్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్, ఆసిఫాబాద్ రూరల్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 20న ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పత్తి రైతుల్లో ఆందోళన

● వర్షాలు లేక పూత, కాత లేని మొక్కలు
● పత్తి సాగుకు అనుకూలించని కాలం



బెజ్జూరులో కాత, పూత లేని పత్తి

పత్తి రైతుల్లో ఆందోళన నెలకొంది. పత్తి చేలు ఏపుగా పెరిగిన అనంతరం వర్షాలు ముఖం చాటేయడంతో పూత, కాత కనిపించడం లేదు. దీంతో రైతులు దిగుబడిపై ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి ఖర్చులైన వస్తాయో లేదోనని బెంగపడుతున్నారు.

బెజ్జూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సాగుకు శ్రీకారం చుట్టిన రైతన్నకు ఈ ఏడాది నష్టాలే మిగిలేలా ఉన్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొనేలా ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3.60లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. అయితే పత్తి పూత, కాత దశలో వర్షాలు లేకపోవడంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభంలో అలా..చివరలో ఇలా..

ఈ ఏడాది వానాకాలం ప్రారంభం నుంచి వాతావరణ మార్పుల కారణంగా రైతుల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. తొలకరి ఆరంభంలో సరైన వర్షాలు కురవలేదు. విత్తనాలు విత్తుకున్న రైతుల్లో ఆందోళన మొదలవగా కొద్దిగా ఆలస్యంగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత జూలై మూడోవారం నుంచి వర్షాలు జోరందుకున్నాయి. అనంతరం ఆగస్టు మూడోవారంలో భారీవర్షాల కారణంగా నియోజకవర్గంలోని ప్రాణహిత, పెద్దవాగు పరివాహకప్రాంత పత్తి చేలన్నీ నీట మునిగాయి. వారంపాటు ప్రాణహిత బ్యాక్‌వాటర్ వరదనీటిలో పత్తినీట మునగడంతో ఆదిలోనే హంసపాదు ఎదురైంది. దీంతో చేసేదేమి లేక తీరప్రాంత రైతులు రెండు, మూడుసార్లు విత్తనాలు విత్తుకున్నారు. ఎలాగోలా సాగుకు చేసిన పెట్టుబడులు దిగుబడి వస్తే తీరుతాయని భావించిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో దిగుబడిపై తీవ్రప్రభావం పడుతుందని రైతుల్లో ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలో ఒకలా చివరలో మరోలా ప్రకృతి తన ప్రకోపాన్ని చూపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాయని కాత..

అక్టోబరు, నవంబరు మాసాలు పత్తిపంట చేతికొచ్చే సమయం. ఈ దశలో వర్షాలు ముఖం చాటేయడంతో కాత పూర్తిగా కాయలేదు. అక్టో బరు ప్రారంభంలో సరైనవర్షాలు కురిసినట్లు యితే కాత, పూత అధికంగా వచ్చే అవకాశం ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. సక్రమంగా వర్షాలు కురవని కారణంగా పూత, కాత లేకపో వడంతో దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన చెందు తున్నారు. కౌలు రైతుల పరిస్థితి అయితే అగమ్యగోచరంగా ఉంది. ఎకరాకు కనీసం ఐదు క్వింటాళ్ల పత్తికూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

నష్టాలే మిగిలేలా ఉన్నాయి..
- చటారి హన్మంతు, రైతు



ఈ ఏడాది అధిక మొత్తంలో పత్తి సాగు చేశాను. పూత, కాత దశలో వర్షాలు లేక లేక దిగుబడి పూర్తిగా తగ్గేలా కనిపిస్తోంది. సాగు కోసం ఇప్పటికే లక్షలు ఖర్చు చేశాను. కనీసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా కనిపించడం లేదు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

ఆసిఫాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లాపోలీసు అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి అధికారికి మైరూరల్ ఇన్ ఇంప్రూవింగ్ పోలీస్ ఇమేజ్‌ఇన్ సొసైటీ (సమాజంలో పోలీసుప్రతిష్ఠను మెరుగు పర్చడంలో నాపాత్ర), ఎస్సైనుంచి అధికారి పైస్థాయి అధికారులకు సౌండ్‌మైండ్‌ఇన్‌సౌండ్ బాడీ (ధ్రుడమైన శరీరంలో ధ్రుడమైన మనసు) అనే అంశాలపై వ్యాసరచన పోలీసులు నిర్వహించగా 26 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురికి ఎస్పీ చేతుల మీదుగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంరోజున ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ కేశవులు తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దహెగాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడంలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌నాయకుడు వెంకటేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అయిదు రోజుల క్రితం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిం చిన అధికారులు, సీఈవో బక్కయ్యపై తక్షణమే చర్యలు తీసుకోవా లన్నారు. ఎస్సీ కమ్యూనిటీకి చెందిన మార్కెట్‌కమిటీ ఛైర్మన్ దేవయ్యను ఆహ్వానించకపోవడం, దళిత సామాజికవర్గాన్ని అవమా నించడమేనని అన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబుకు ప్రోటోకాల్ పాటించడం తెలియకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోగేష్, మల్లేష్, తిరుపతి, అశోక్, శంకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం రాత్రి ఓమోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడినవర్షం కురిసింది. ఆసిఫాబాద్, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూరు(టి), కెరమెరిమండలాల్లో ఓ మోస్తారువర్షం కురియగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో కురిసిన వర్షానికి పత్తిపంటకు ప్రయోజనం చేకూరనుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సిర్పూర్(యు)/కౌటాల: సిర్పూర్(యు), కౌటాల మండలాల్లో శనివారం గంటపాటు భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకధాటిగా వాన దంచికొట్టింది. 20రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తిరైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో శనివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి, మిర్చి, సోయాచిక్కుడు రైతులు ఆందోళన చెందారు. పత్తిపంటకు ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు.

వర్ధంతిని విజయవంతం చేయండి

బెజ్జూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుమరంభీం జన్మస్థలం రౌటసంకెపల్లిలో ఈ నెల22న నిర్వహించే కుమరంభీం, ఎడ్లకొండు వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆదివాసీసంఘాల నాయకులు కోరారు. శనివారం వర్ధంతిసభ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో ఆదివాసీలు హాజరై వర్ధంతిసభను విజయవంతం చేయాలన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

● ఊడిపోతున్న కింది గచ్చు ● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది ● మరమ్మతులు చేస్తేనే మేలు



కార్యాలయంలో పగిలిన టైల్స్

బెజ్జూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి రైతులకు, విద్యార్థులకు వివిధ రకాల సేవలు అందిస్తోన్న తహసీల్దార్ కార్యాలయం శథిలావస్థకు చేరడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని కింది గచ్చు పూర్తిగా ఊడిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గత రెండేళ్ల నుంచి కింద వేసిన టైల్స్ పూర్తిగా పగిలిపోయి మట్టి బయటకు రావడంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయం

జాడలేని మరమ్మతులు..

గత పదిహేనేళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు రెండేళ్ల నుంచి టైల్స్ పూర్తిగా చెడిపోవడంతో అధికారులు మరమ్మత్తులు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. మరమ్మత్తుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినా నిధులు మంజూరు కావడం లేదని అధికారులు వాపోతున్నారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, అధికారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసఇన వర్షాలకు పైనుంచి వర్షపు నీరు కూడా ఊరుస్తుండటంతో కంప్యూటర్లు, వివిధ రకాల దస్త్రాలు తడిచిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ప్రతినిత్యం వివిధ రకాల సమస్యల కోసం వచ్చే రైతులు, ఇతరులతో కార్యాలయం సందడిగా ఉండే తహసీల్దార్ కార్యాలయం మరమ్మత్తులు చేపట్టేందుకు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



ఆర్మీజవాన్ శ్రీరాంను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వాంకిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్లపూర్ గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ వడై శ్రీరాంను శనివారం ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రయ్య మాట్లాడుతూ వాంకిడి మండలానికి చెందిన వడై శ్రీరాం ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో చదువుకొని ఆర్మీఉద్యోగంలో చేరడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శ్రీరాంను ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్‌కుమార్, తిరుపతి, రాజమౌళి, సంతోష్, శ్రీధర్, శ్రీకాంత్, సత్యం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడాదుస్తులు పంపిణీ



క్రీడాదుస్తులతో విద్యార్థినులు

దహెగాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పూర్వవిద్యార్థి లింగారావు తన కుమార్తె సుదీక్ష పుట్టిన రోజును పురస్కరించుకుని 40జతల క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, పాఠశాలచైర్మన్ సుశీల, ఎస్సై రాజు, తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 22న నిర్వహించే సదరంశిబిరాలను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లాగ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో సదరం శిబిరం నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమపరిధిలోని ప్రాథమికఆరోగ్య సేవకేంద్రంలో దివ్యాంగత్వ పరీక్షచేయించుకుని, స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. ఆతరువాత దివ్యాంగత్వ ఆరోగ్య పరీక్షపత్రాలతో శిబిరానికి హాజరుకావాలని తెలిపారు. ఈనెల22న మానసిక వైకల్యం, 24న కంటిచూపు, 25న మూగ,చెవిటి, 29న ఎముకల సంబంధిత పరీక్షలు నిర్వహి స్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు సకాలంలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'పౌష్టికాహారాన్ని తీసుకోవాలి'

వాంకిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకవిలువలుగల ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యశాఖ హెచ్‌ఈవో రవిదాస్ అన్నారు. శనివారం మండలంలోని ఘాట్ జనగాం గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందుతున్న సేవలు,టీకాలు,కేంద్రంలో అంది స్తున్న పౌష్టికఆహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం కృష్ణకుమారి, సిబ్బంది భగవాన్‌దాస్, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ..



ప్రహరీ లేని మండల పరిషత్ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ మండల పరిషత్ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని శనివారం కాలనీవాసులు డిమాండ్ చేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణలో తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం కూడా శిథిలావస్థకు చేరుకుందని దానిని పునర్నిర్మించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన అధికారి

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 10వ వార్డులో ఒంటరిగా తిరుగుతున్న వృద్ధుడు దుర్గయ్య(78) గురించి స్థానిక నాయకుడు వనమాల రాము పట్టణసీఐ శంకరయ్యకు సమాచారం అందించారు. దీంతో బ్లూకోట్ కానిస్టేబుల్ వెంకటేష్ వృద్ధుడి వివరాలను సేకరించి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ బ్లూకోట్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను అభినందించారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ



డిక్షనరీలతో విద్యార్థులకు, హెచ్‌ఎం రాకేష్

పెంచికలపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాకేష్ సొంత ఖర్చులతో పదవతరగతి విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు సాధించడానికి శనివారం డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఇస్మాయిల్, వెంకటేష్, ఉత్తం, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని మజీద్‌వాడ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడిపై దాడిచేసిన ఓ విద్యార్థి తండ్రి ఇగురపు విలాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధ్యాయుడు జాదవ్ గోవింద్‌రావును మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అదేపాఠశాలలో చదివే ఓ విద్యార్థి తండ్రి విలాస్ దుర్భాషలాడుతూ భౌతిక దాడిచేశాడు. దీంతో ఉపాధ్యాయుడు గోవింద్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇగురపు విలాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అధిక ధరలకు గ్యాస్ సిలిండర్ల విక్రయాలు

● అధికారుల అండదండతో కొనసాగుతున్న దందా ● గ్రామాల్లోనే గ్యాస్ సిలిండర్ స్టాక్ పాయింట్‌లు



గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్లు

కెరమెరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గ్యాస్ సిలిండర్లను అధికధరలకు విక్రయిస్తున్నారు. మండలంలో విక్రయిస్తున్న గ్యాస్ సిలిండర్లను జైనూరు ఏజెన్సీ నుంచి తీసుకువచ్చి గ్రామాల్లోనే అక్రమంగా స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడినుంచి వాహనాల ద్వారా గ్రామాల్లోని వినియోగదారులకు సప్లై చేస్తున్నారు. ప్రతిసిలిండర్‌పై రూ.50నుంచి రూ.70లు అధికంగా వసూలు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ ఏజెన్సీలు వంటగ్యాస్ సిలిండర్‌లను సరఫరా చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అధికారులు వంటగ్యాస్ ఏజెన్సీలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎనిమిది కిలోమీటర్ల రేడియస్ పరిధిలోఉన్న వినియోగదారులకు ఉచితంగానే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాల్సి ఉండగా ట్రాన్స్‌ఫర్ట్ చార్జీల పేరిట అదనంగా మరో వంద రూపాయలు వసూలు చేస్తున్నారు. గ్యాస్‌ఏజెన్సీలలో పనిచేస్తున్న డెలవరీ బాయ్స్‌కు, గ్యాస్‌ఏజెన్సీల యజమానులు ఎటువంటి జీతాలు చెల్లించకుండా వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని చెప్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం అధికారులు కంటితుడుపు చర్యలు చేపట్టి గ్యాస్‌ఏజెన్సీ యజమానులకే వత్తాసు పలుకుతున్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గ్యాస్‌ఏజెన్సీలపై ప్రజలు, వినియోగదారులు ఎన్నో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రతినెల మామూళ్ల రూపంలో డబ్బులు తీసుకుంటూ వినియోగదారుల ఫిర్యాదులను చెత్త కుప్పలో పడేస్తున్నారు.